గణపురం : అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణరావు
- పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

చిట్యాల/గణపురం/రేగొండ/మొగుళ్లపల్లి, మార్చి 13 : అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం చిట్యాల మండలంలోని ఏలేటిరామయ్యపల్లిలో రూ. 8.85 లక్షలతో కర్నాలకుంట చెరువు, రూ. 12.15 లక్షలతో ఎస్సారెస్పీ డీబీఎం-38 మరమ్మతు, రూ. 15 లక్షలతో తిరుమలాపూర్‌లో ఎస్సీ కమ్యూనిటీ హాల్, రూ. 9.70 లక్షలతో కన్నయ్యకుంట చెరువు మరమ్మతు, రూ. 12.35 లక్షలతో జడలపేట ఈదలకుంట చెరువు మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే గణపురం మండలం చెల్వూర్‌లో రూ. 10 లక్షలతో మహిళా సమాఖ్య భవనం నిర్మాణం, రూ. 10 లక్షలతో సీసీ రోడ్లు, రూ. 9.90 లక్షలతో శివాలయం ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రేగొండ మండలం భాగిర్థిపేటలోని రామన్నగూడెం పెద్ద చెరువు మరమ్మతు పనులను, అనంతరం రేగొండ మండల కేంద్రం నుంచి ములుగు జిల్లా కేంద్రానికి ఆర్టీసీ బస్ సర్వీస్‌ను ప్రారంభించారు. అలాగే మొగుళ్లపల్లి మండలంలోని ఇస్సిపేటలో రూ. 20 లక్షలతో రెడ్డి సంఘం భవనం, రూ. 10 లక్షలతో రామాంజనేయ భక్తమండలి భవనం, రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి, రూ. 48 లక్షలతో అంకుషాపురం గ్రామ చెరువు మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తుందన్నారు. ఇప్పటికే పలు పథకాలను అమలు చేస్తున్నామని, త్వరలోనే మిగిలినవి ప్రారంభిస్తామని తెలిపారు. అధిక వర్షాలతో నియోజకవర్గంలోని చాలా చెరువులు తెగిపోయి రైతులు సాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటి మరమ్మతులకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించామన్నారు. కాంట్రాక్టర్లు పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో చిట్యాల, రేగొండ కాంగ్రెస్ మండలాధ్యక్షులు గూట్ల తిరుపతి, ఇప్పకాయల నర్సయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మధు వంశీకృష్ణ, నాయకులు దొడ్డి కిష్టయ్య, చిలుకల రాయకొమురు, టౌన్ అధ్యక్షుడు బుర్ర లక్ష్మణ్ గౌడ్, పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు గుమ్మడి శ్రీదేవి, గణపురం, రేగొండ ఎంపీపీలు కావటి రజితారవీందర్, పున్నం లక్ష్మి, సొసైటీ చైర్మన్ గండ్ర సత్యనారాయణరెడ్డి, నాయకులు సంపత్‌రావు, కొత్త పద్మావెంకన్న, ఐబీ డీఈ గిరిబాబు, ఎర్రబెల్లి పున్నంచందర్‌రావు, రఫీ, రాము, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఆరోగ్య సూత్రాలు పాటించాలి

వృద్ధురాలికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రవీందర్‌నాయక్

ములుగురూరల్, మార్చి13 : ప్రజలు ఆరోగ్య సూత్రాలు పాటించాలని జిల్లా టీబీ, ఎయిడ్స్ వ్యాధుల నియంత్రణ వైద్యాధికారి పోరిక రవీందర్ నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని శివతండా గ్రామ పంచాయతీ పరిధి నౌశ్యతండాలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ మేరకు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి వైరల్ ఫీవర్‌తో కొంతమంది బాధపడుతున్నట్లు గుర్తించి మందులను అందించారు. పరిసరాలతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని ప్రజలకు సూచించారు. ఎండలు మండిపోతున్నందున వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనారోగ్య సమస్య తలెత్తిన వెంటనే సబ్‌సెంటర్ లేదా పీహెచ్‌సీని సంప్రదించి వైద్యం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి నందకిశోర్, ఆశ వర్కర్ శారద పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించిన మంత్రి

మల్హర్, మార్చి 13 : మండలంలోని తాడిచర్ల, మల్లారం గ్రామాల్లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి శ్రీధర్‌బాబు బుధవారం రాత్రి పలు అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా రూ. 1.50 కోట్లతో తాడిచర్లలో నిర్మించిన తహసీల్దార్ కార్యాలయాన్ని, మల్లారంలోని కస్తూర్బా పాఠశాలలో రూ. 3 కోట్లతో నిర్మించిన అదనపు తరగతి గదులు, రూ. 15 లక్షలతో నిర్మించిన సబ్ సెంటర్‌ను ప్రారంభించారు. అలాగే తాడిచర్ల పీహెచ్‌సీలో రూ. 15 లక్షలతో చేపట్టనున్న వైద్యాధికారి రెస్ట్ రూం, రూ. 25 లక్షలతో నిర్మించనున్న లైబ్రరీ భవనం, రైతుల పంట పొలాలకు వెళ్లే దారిలో రూ. 40 లక్షలతో చేపట్టిన రోడ్ డ్యాం పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఎంపీపీ మలహల్‌రావు, ఎంపీటీసీ ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీధర్ బాబుకు తప్పని కరెంటు కష్టాలు

- అధికారిక కార్యక్రమంలోనే పవర్ కట్

చీకట్లోనే మంత్రితో ఫొటో దిగుతున్న విద్యార్థినులు

మల్హర్ మార్చి 13 : కాంగ్రెస్ పాలనలో సాక్షాత్తూ రాష్ట్ర మంత్రికే కరెంటు కష్టాలు తప్పలేదు. ఓ అధికారిక కార్యక్రమంలోనే కరెంటు పోవడంతో సెల్‌ఫోన్ లైట్లే దిక్కయిన ఘటన మండలంలోని మల్లారంలో జరిగింది. మండలంలో పలు అభివృద్ధి పనులకు బుధవారం రాత్రి రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు హాజరయ్యారు. షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం రెండు గంటలకు మల్లారం కస్తూర్బా ఆశ్రమ పాఠశాలలో అదనపు తరగతి గదుల ప్రారంభోత్సవానికి హాజరుకావాల్సి ఉండగా రాత్రి 8.30కు వచ్చారు. అప్పటిదాకా విద్యార్థులు, అధికారులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఇంతవరకు బాగానే ఉన్నా మంత్రి కార్యక్రమాన్ని ముగించుకొని వేదిక దిగుతుండగానే కరెంటు పోవడంతో దాదాపు పావుగంట పాటు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఎదురైంది. మంత్రికి తమ సమస్యలు చెబుదామని విద్యార్థులు ప్రయత్నించగా మొత్తం చీకటి ఉండడంతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తమ సెల్‌ఫోన్ లైట్లను వెలిగించారు.

నీటి సమస్య తలెత్తకుండా చూడాలి

ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

గోవిందరావుపేట, మార్చి 13 : రానున్న ఏప్రిల్, మే నెలల్లో ప్రజలకు మంచి నీటి సమస్య రాకుండా చూడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో తాగునీటి సరఫరాపై కలెక్టర్ మండల స్థాయి సమీక్ష నిర్వహించారు. గ్రామాల వారీగా తాగునీటి సమస్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అన్ని హాబిటేషన్లలో తాగునీటి సరఫరా సరిగా జరుగాలని ఆదేశించారు. అందుబాటులో ఉన్న 15వ ఫైనాన్స్ ఫండ్‌ను తాగునీటి సమస్యకు వినియోగించాలని, చేతిపంపులను వినియోగంలోకి తేవాలన్నారు. ముందస్తుగా కార్యాచరణ రూపొందించుకొని, ఎక్కడైనా మేజర్ సమస్యలు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం అధికారులతో కలిసి 'సేవ్ వాటర్' టోపీలను ధరించారు. మిషన్ భగీరథ ఇంజినీరింగ్ సూపరింటెండెంట్ మల్లేశ్, ఇంట్రా ఎండీ ఈఈ సుభాష్, ఎంపీడీవో జవహర్‌రెడ్డి, తహసీల్దార్ సృతజన్‌కుమార్, డీఎల్పీవో స్వరూపారాణి, ఎంపీవో సాజిదాబేగం, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ చంద్రకాంత్, సీహెచ్ మధు, అన్ని గ్రామాల కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

వన్‌టైం సెటిల్‌మెంట్‌ను వినియోగించుకోవాలి

మాట్లాడుతున్న రాంచంద్రరావు

ఏటూరునాగారం, మార్చి 13 : పెండింగ్‌లో ఉన్న రుణాలను రాయితీపై వన్ టైం సెటిల్‌మెంట్ చేసుకునే అవకాశం ఉన్నందున రుణ గ్రహీతలు వినియోగించుకోవాలని ఏపీజీవీబీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ వీ రామచంద్రమూర్తి కోరారు. మండలంలోని చిన్నబోయినపల్లి గ్రామంలో బుధవారం రైతులు, ఖాతాదారులు, జెఎల్‌జీ గ్రూపు సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేఎల్‌జీ గ్రూపు సభ్యులు రుణాలు చెల్లించకుండా పెండింగ్ ఉంచారని, వారి ఖాతా స్టేటస్‌ను బట్టి 30 నుంచి 50శాతం వరకు రాయితీ ఇచ్చి సెటిల్‌మెంట్ చేసుకునే అవకాశం ఉందన్నారు. రుణాలు తీసుకున్న వారంతా కూడా మాఫీ అవుతాయని కట్టకుండా ఉండడం వల్ల మరింత వడ్డీ పెరిగే అవకాశం ఉందన్నారు. ఇలాంటి అవకాశాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కాగా, అటవీశాఖ అధికారులు భూములను సాగు చేయనీయకుండా అడ్డుకోవడం వల్ల రుణాలు సకాలంలో చెల్లించలేకపోయామని, తమకు రుణాల చెల్లింపుల్లో 50శాతం మినహాయింపు ఇవ్వాలని కోరుతూ జేఎల్‌జీ సభ్యులు వినతి పత్రం అందజేశారు. సమావేశంలో లా ఆఫీసర్ వెంకట సుబ్బయ్య, ఏపీజీవీబీ బ్రాంచి మేనేజర్ జాగోర్, ఫీల్డ్ ఆఫీసర్ సురేశ్, రైతు కమిటీ అధ్యక్షుడు వడకాపురం సారయ్య, రైతులు నూర్జాన్, ఫత్తే మహ్మద్, బుచ్చిరెడ్డి, శారద, ఖాజాపాషా, సీఏ శ్రీలత పాల్గొన్నారు.

నిరుద్యోగులకు స్టడీ మెటీరియల్ అందజేత

ములుగురూరల్, మార్చి13 : తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జి ఆధ్వర్యంలో గ్రూప్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లేశం స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత అవగాహన సదస్సు నిర్వహించగా 100 మంది అభ్యర్థులు హాజరైనట్లు చెప్పారు. ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్ష పాఠ్య ప్రణాళికలు, ప్రమాణిక పుస్తకాల మెళకువలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎండీ యాకూబ్, ఉమాదేవి, నాగమణి, విజత, ఉదయ్‌శ్రీ పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

గణపురం, మార్చి 13 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసేందుకు అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాజు దేవుడే బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 ప్రొఫెసర్లు, 20 అసోసియేట్ ప్రొఫెసర్లు, 22 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 9 సీనియర్ రెసిడెంట్స్ ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందన్నారు. అర్హత ఉన్నవారు కులం, నివాస, ఇతర ధ్రువీకరణ పత్రాలు, విద్యార్హత ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 16న ఉదయం 10.30నుంచి సాయంత్రం 5 గంటల వరకు మంజూర్‌నగర్‌లోని కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

విద్యుత్ తీగలు అమర్చితే చర్యలు తప్పవు

గోవిందరావుపేట, మార్చి13 : రైతులు తమ పంట పొలాల వద్ద విద్యుత్ తీగలు అమర్చితే చట్టపరంగా చర్యలు తప్పవని ఏఈ ఎస్సై కమలాకర్ అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా బుధవారం ఉదయం దుంపల్లిగూడెంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కొంత మంది కావాలనే పంట పొలాల వద్ద విద్యుత్ తీగలు అమర్చి వన్య ప్రాణులను వేటాడుతున్నారని, ఈ క్రమంలో అటువైపు వెళ్లిన పలువురు విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందుతున్నారని తెలిపారు. ఇకపై రైతులు విద్యుత్ తీగలు అమర్చితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని నిఘా పెంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు.

మాట్లాడుతున్న ఎస్సై కమలాకర్

విప్లవ పార్టీలకు సహకరించొద్దు

వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై వెంకటేశ్వర్‌రావు

వాజేడు,మార్చి,13 : ప్రభుత్వ నిషేధిత విప్లవ సంఘాలు, పార్టీలకు సహకరించొద్దని ఎస్సై చావళ్ల వెంకటేశ్వర్‌రావు ప్రజలకు సూచించారు. బుధవారం ఆయన కొంగాల గ్రామస్తులతో కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత గంజాయి, గుడుంబా వంటి మత్తు పదార్థాలకు బానిసై జీవితం నాశనం చేసుకోవద్దన్నారు. బాల్య వివాహాలు, చిన్న వయస్సులో ప్రేమ పేరుతో బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. గంజాయి, గుడుంబా అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సైబర్ మోసాలకు బలికాకుండా ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పాయబాట్ల గ్రామంలో వాహన తనిఖీలు చేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంతో పాటు వివిధ ప్రాంతాలకు వచ్చిపోయే వాహనాలను ఆపి బ్యాగులు తీసి సోదాలు చేశారు. సరైన పత్రాలులేని వాహనదారులకు జరిమానా విధించారు.

ఐటీడీఏ ఏస్డీసీగా విజయకుమారి

ఏటూరునాగారం, మార్చి 13 : ఐటీడీఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా వికారాబాద్ ఆర్డీవో విజయకుమారిని నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీవోల బదిలీలు జరిగాయి. కాగా, ఇక్కడ వారం రోజుల క్రితం స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవోగా పనిచేస్తున్న రామ్మూర్తిని ఏటూరునాగారం ఐటీడీఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించారు. వారం రోజులకే రామ్మూర్తిని ఇక్కడ నుంచి హుస్నాబాద్ ఆర్డీవోగా బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. అయితే రామ్మూర్తి ఇక్కడ జాయిన్ కాకముందే బదిలీ ఉత్తర్వులు వచ్చినట్లు తెలుస్తోంది.

పీఆర్సీ చైర్మన్‌ను కలిసిన ఏటీఎఫ్ నాయకులు

వెంకటాపురం (నూగూరు), మార్చి 13 : పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ) చైర్మన్ శివశంకర్‌ను బుధవారం తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు, కార్యదర్శి రవి, ఉపాధ్యక్షుడు పీర్ల కృష్ణబాబు ఆధ్వర్యంలో కలిశారు. ఈ సందర్భంగా వారు ఏజెన్సీలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు హెచ్‌ఆర్ఏ, ఏహెచ్ఆర్ఏ, ఎస్‌సీఈ స్లాబ్ రేట్లు పెంచాలని కోరారు. ఏజెన్సీలో అలవెన్స్‌లు తక్కువగా ఉండడం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు మైదాన ప్రాంతాలకు బదిలీపై వెళ్తున్నారని తెలిపారు. నాయకులు కోరం సంతోష్, లక్ష్మయ్య, రమేష్, రాంబాబు పాల్గొన్నారు.

మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలి

చిన్నారులకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

వాజేడు, మార్చి, 13 : తల్లులు, పిల్లలు, కిశోర బాలికలు, మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ అధికారులు అన్నారు. బుధవారం మండలంలోని జంగాలపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో వెంకటాపురం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పోషణ పక్షం సందర్భంగా ఆరోగ్యవంతమైన బిడ్డకు, ప్రీస్కూల్‌కు రెగ్యులర్‌గా అటెండ్ అయిన ఐదుగురు చిన్నారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పవతి, మండల అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తులు

ములుగురూరల్, మార్చి13 : షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ ద్వారా 100 మంది అభ్యర్థులకు రెండు నెలలు డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, ఎస్సీ స్టడీ సర్కిల్ ఉమ్మడి వరంగల్ జిల్లా గౌరవ సంచాలకులు డాక్టర్ కే జగన్‌మోహన్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 3 నుంచి జూన్ 2 వరకు వసతి భోజనంతో పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. tsstudycircle.co.in అనే వెబ్ సైట్‌లో 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

15న జాబ్‌మేళా

ప్రైవేట్ రంగంలో యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 15న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కుమారస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 98497 85546, 82973 38888 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

భూములకు రక్షణ కల్పించాలని రాస్తారోకో

వెంకటాపురం (నూగూరు), మార్చి 13 : మండలంలోని కొమురంభీమ్ కాలనీలోని ఆదివాసీల భూములకు రక్షణ కల్పించాలని కోరుతూ బుధవారం మండలకేంద్రంలో గోండ్వానా సంక్షేమ పరిషత్ (జీఎస్‌పీ) ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి మాట్లాడుతూ ఆదివాసీలు సాగు చేసుకుంటున్న భూములను గిరిజనేతరులు ఆక్రమించు కోవాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు ఆదివాసీల భూములకు రక్షణ కల్పించాలని కోరారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న ఎస్సై అశోక్ అక్కడికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

గుడుంబా తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

వాజేడు, మార్చి 13 : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి గుడుంబా ప్యాకెట్లు తరలిస్తున్న ఇద్దరిని పేరూరు పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై గొర్ల రమేశ్ కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి చెరుకూరు వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరిని కృష్ణాపురం గ్రామం వద్ద పోలీసులు ఆపి తనిఖీ చేశారు. వారి వద్ద 22 లీటర్ల గుడుంబా ఉన్నట్లు గుర్తించారు. జగన్నాథపురం, కొప్పుసూరు గ్రామాలకు చెందిన మడుగుల ముసలయ్య,కొగిల వెంకటేశ్‌తో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకొని కేస్ నమోదు చేసినట్లు చెప్పారు.

కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఘనంగా ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు

కృష్ణకాలనీ, మార్చి 13 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడు మాడ హరిశేరెడ్డి ఆధ్వర్యంలో భారీ కేక్‌ను కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కల్వకుంట్ల కవితక్క రానున్న రోజుల్లో మరిన్ని పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు చీకటి గణేశ్, మద్దెల వంశీ, అంతటి రాము గౌడ్, సందీప్ గౌడ్, పొక్కూరి శ్రీనాథ్, శివప్రసాద్‌రెడ్డి, వినయ్, వర్మ, సుంకరి నరేశ్, రాహుల్, అఫ్రోజ్, సాయి, అభిలాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించాలి

మల్హర్, మార్చి 13 : గ్రామాల్లో 3 నుంచి ఐదేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సీడీపీవో రాధిక సూచించారు. బుధవారం మండలంలోని వల్లెకుంట, మల్లారం, తాడిచర్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన పోషణ పక్వాడలో కార్యక్రమాల్లో ఆమె పాల్గొని మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ఆరు నెలలు వచ్చే వరకు తల్లి పాలు తాగించాలన్నారు. గుడ్డుతోపాటు బాలామృతం తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సరస్వతి, పోషణ అభియాన్ డీఏపీ స్వప్న, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణులు, తల్లులు పాల్గొన్నారు.

ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి

నివాళులర్పిస్తున్న శాలివాహన సంఘం సభ్యులు

మహదేవపూర్, మార్చి 13 : మండల కేంద్రంలోని ఐబీ విశ్రాంతి భవనంలో శాలివాహన సంఘం ఆధ్వర్యంలో బుధవారం కవయిత్రి మొల్ల 583వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గుడాల అరుణ, పీఏసీఎస్ చైర్మన్ చల్లా తిరుపతిరెడ్డి, శాలివాహన సంఘం నాయకులు కుమ్మరి తిరుపతి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

గణపురం, మార్చి 13 : జిల్లా కేంద్రంలోని జేఎఫ్ఎంఎస్ కోర్టులో గురువారం నుంచి శనివారం వరకు నిర్వహించే లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలని ఎస్సై మచ్చ సాంబమూర్తి బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. కొట్టుకున్న, తిట్టుకున్న, భూమి తగాదా, దొంగతనం, యాక్సిడెంట్, డ్రంక్ అండ్ డ్రైవ్, మాస్క్ కేసులున్న వారు ఆధార్‌కార్డుతో వెళ్లి ఒక్క రూపాయి ఖర్చు లేకుండా కేసును పరిష్కరించుకోవాలన్నారు.

'ఉపాధి హామీ'లో కూలీల సంఖ్య తగ్గొద్దు

పలిమెల, మార్చి 13 : మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రతిరోజూ పనిచేసే కూలీల సంఖ్య 75కు తగ్గకుండా చూడాలని ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్లు, జీపీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీల సంఖ్యతో పాటు ఆవరేజ్ రేట్, టైమ్లీ పేమెంట్‌లను పెంచాలని ఆదేశించారు. నర్సరీల్లో 100 శాతం విత్తనాలు మొలకెత్తేలా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీవో ప్రకాశ్‌రెడ్డి, ఏపీవో సునీత, ఈసీ శ్రీకాంత్, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఓఎస్‌డీగా హబీబ్ బాధ్యతలు



భూపాలపల్లి సింగరేణి ఓఎస్‌డీగా బాధ్యతలు స్వీకరిస్తున్న హబీబ్ హుస్సేన్

భూపాలపల్లి రూరల్, మార్చి 13 : భూపాలపల్లి సింగరేణి ఓఎస్‌డీగా హబీబ్ హుస్సేన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జీఎం కార్యాలయ సిబ్బంది, ఇతర అధికారులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఓఎస్‌డీ మాట్లాడుతూ సంస్థ పురోగతికి, నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి, ప్రమాద రహిత బొగ్గు ఉత్పత్తికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. భూపాలపల్లి ఏరియా అధికార ప్రతినిధి అజ్మీరా తుకారాం, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ